మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు ముస్లింలు

- హిందూ-ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా పీలేరు టీడీపీ



పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరుతున్న ముస్లిం మైనారిటీ నాయకులు

పీలేరు, జూలై 2: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపి టీడీపీ అధికారంలోకి వస్తే తిరుమలకు కాలినడకన వస్తామని మొక్కుకున్న పీలేరు టీడీపీ మైనార్టీ నాయకులు మంగళవారం తిరుమలకు బయలుదేరారు. తాము ముస్లింలైనా కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల వేంకటేశ్వరుడిని మొక్కుకుంటే ఆ మొక్కు తప్పక ఫలిస్తుందన్న స్నేహితుల సూచన మేరకు పీలేరుకు చెందిన ముస్లిం మైనారిటీ నేత తన అభిమాన నాయకుడు గెలుపొందాలని మొక్కుకున్నాడు. పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన టీడీపీ తెలుగు యువత నేత రియాజ్‌కు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అంటే విపరీతమైన అభిమానం. ఆయనపై అభిమానంతో తన పేరు ముందు నల్లారి అని పెట్టుకుని నల్లారి రియాజ్‌గా ప్రాచుర్యం పొందాడు. నల్లారి గెలుపుతో పాటు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మంగళవారం ఉదయం పీలేరు పట్టణంలోని పెద్దపీర్ల చావిడి మీనారు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు కూడా వారికి సంఘీభావం తెలిపారు. ముస్లిం అయినప్పటికీ తన అభిమాన నేత కోసం వేంకటేశ్వరుడిని మొక్కుకోవడమే కాకుండా దాదాపు 30 మందితో కలిసి పాదయాత్రగా తిరుమలకు వెళుతుండటం ఆదర్శనీయమని టీడీపీ రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోటపల్లె బాబు తెలిపారు. రియాజ్ బృందం పాదయాత్ర సురక్షితంగా తిరుమల చేరాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహమ్మద్ పీర్, ఫైరోజ్, సలీం, ఎన్టీఆర్ నఫీస్, కోటపల్లె శ్రీనాథరెడ్డి, నరేశ్, సురేశ్, బర్కతుల్లా, పురం రామ్మూర్తి, అమరనాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలన గాడినపడేనా..?

- అధికారుల్లో వైసీపీ వాసన పోని వైనం
- కీలక పోస్టుల్లో అంతా పాత అధికారులే
- ఇంకా కుర్చీ ఖాళీ చేయని డ్వామా పీడీ
- చంద్రబాబు 4.0 మార్కు పాలన రావాలంటే ప్రక్షాళన జరగాల్సిందే

టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు నెల అవుతున్నా ఇంకా పాలన గాడిలో పడలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా అధికార యంత్రాంగం ఎంపీ అవినాశ్‌రెడ్డికి మోకరిల్లిందనే విమర్శ ఉంది. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ కుట్టదన్నట్టు.. ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారసు, ఫోన్ కాల్ లేకుండా పనులే జరగవనే చర్చ అధికార, వైసీపీ వర్గాల్లో ఉండేది. ఇప్పుడు కూడా జిల్లా అధికార యంత్రాంగంపై పులివెందుల ప్రభావం బాగా ఉన్నట్లు అర్థమవుతోంది. ఇంకా కొందరు అధికారులు జగన్ పాలన ఉందన్న భ్రమలో ఉంటూ అలాగే కాలం గడుపుతున్నారన్న విమర్శ ఉంది.

(కడప-ఆంధ్రజ్యోతి): మళ్లీ 1995 నాటి పాలన నాలో చూస్తారు. 4.0 పాలన మొదలవుతుంది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం పింఛన్ల పంపిణీ సందర్భంగా అన్నారు. 1995లో చంద్రబాబునాయుడు సీఎం అయిన తరువాత పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలతో పాలనను పరుగులు పెట్టించేవారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు చంద్రబాబు 4.0 పాలన చూస్తారని చెప్పుకొచ్చారు. అయితే చంద్రబాబు మార్కు పాలన సాగాలంటే జిల్లాలో అధికార యంత్రాంగంలో ప్రక్షాళన జరగాల్సి ఉంది. ఇంకా జిల్లాలోని కీలకశాఖలలో పాత అధికారులే పాతుకుపోయారు.

డ్వామాలో పులివెందుల పవర్

డ్వామా పీడీగా పనిచేస్తున్న యదుభూషణరెడ్డి వైఎస్ కుటుంబానికి భక్తుడనే పేరుంది. ఈయన రెండేళ్ల క్రితమే పదవీ విరమణ చేశారు. అయితే ఎంపీ అవినాశ్‌తో ఉన్న అటాచ్‌మెంటుతో మళ్లీ రెండేళ్లు పొడిగించుకున్నారు. ఆ టైం అయిపోవడంతో మళ్లీ రెండు సంవత్సరాలు పొడిగించుకున్నారు. డ్వామా కార్యాలయాన్ని వైసీపీకి కేరాఫ్‌గా మార్చారనే విమర్శ ఉంది. పులివెందుల సిఫారసు లేఖలతో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటరు ఆపరేటర్లుగా సుమారు 25 మంది వైసీపీ వారిని నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. రిటైర్ అయినా మళ్లీ అదే పోస్టులో కొనసాగుతున్న అధికారులను ఇటీవలే చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. అయితే యదుభూషణరెడ్డి మాత్రం ఇంకా రోజూ విధులకు హాజరవుతున్నారు. అలాగే డ్వామాలోనే విజిలెన్స్ అధికారిగా యోగాంజనే యరెడ్డి కూడా రిటైర్ అయ్యారు. ప్రభుత్వం తొల గించినా వీరిద్దరు ఇంకా విధులకు హాజరవుతుండడం, సిబ్బందితో యథావిధిగా మీటింగులు పెట్టుకోవడం చేస్తున్నారు. మూడురోజుల క్రితం ఏపీడీలను కూడా బదిలీ చేయడం గమనార్హం. టీడీపీ ప్రభుత్వం వచ్చినా డ్వామాలో ఇంకా పులివెందుల పవర్‌కే ప్రాధాన్యం ఇస్తుండడాన్ని చూసి సిబ్బందే ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనలో జిల్లా పరిషత్ కీలకం. దీని పరిధిలోని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, ఇతరత్రా వాటిని చేపడతారు. జిల్లా పరిషత్ పాలకవర్గం వైసీపీ చేతల్లో ఉంది. అయితే జిల్లాపరిషత్‌లో సిబ్బంది కూడా కొందరు ప్రభుత్వ ఉద్యోగులని మరిచిపోయి వైసీపీకి బానిసలుగా మారిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ వివిధ శాఖల్లో పనిచేసేవారు చాలా ఏళ్లుగా పాతుకుపోయారు. వదల బొమ్మాళీ వదల అన్నట్లుగా జడ్పీని వీడకుండా అక్కడే పనిచేస్తూ వైసీపీకి గులాం చేస్తున్నారు.
- జిల్లా పంచాయతీ కార్యాలయంలో కూడా ఇంకా వైసీపీ భక్తులే ఉన్నారంటారు. సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను వైసీపీకి వేయించేలా ఓ అధికారి వ్యవహరించారనే విమర్శ ఉంది. ఒకప్పుడు ఆయనకు మంచి పేరు ఉన్నప్పటికీ వైసీపీ పాలనలో మాత్రం వన్‌సైడ్‌గా మారారంటారు. పంచాయతీల్లో అవకతవకలు జరిగినా కూడా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నారన్న విమర్శ ఉంది.

పడకేసిన వైద్యం

జిల్లాలో వైద్యశాఖ నిర్లిప్తతగా ఉంది. కీలక అధికారే వైసీపీతో అంటకాగారనే విమర్శలు ఉన్నాయి. ఇక రిమ్స్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కీలక అధికారులు పులివెందుల పవర్‌కు ప్రాధాన్యతనిస్తారు. ఇక్కడ సేవల్లో వేగవంతం లేదు. ఇక నీటిపారుదల శాఖలో కీలక అధికారే నిర్లిప్తంగా ఉన్నారు. ఎస్ఈ శ్రీనివాసులు పనితీరుపై విమర్శలున్నాయి.



పోలీసుశాఖ

వైసీపీ పాలనలో అంతా ఐపీసీ సెక్షన్ బదులు వైపీసీ సెక్షన్ అమలు చేశారనే విమర్శ ఉంది. జిల్లాలో పెద్ద ఎత్తున భూకబ్జాలకు పోలీసులే పంచాయితీ చేశారనే ఆరోపణలు న్నాయి. కడపలో అయితే గంజాయి గుప్పుమంటుంది. గంజాయి మత్తులో ఎవరు ఏం చేస్తున్నారనేది అర్థం కాని పరిసితుల్లో ఉన్నారు. దీంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. ఇంకా గంజాయి బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకోలేదు. రౌడీబ్యాచ్‌లు కూడా వీధికొకటి ఉన్నాయి. కడప డీఎస్పీ వైసీపీకి అనుకూలంగా ఉంటారనే ఆరోపణలున్నాయి. ఇలా కీలకశాఖలన్నీ ఇంకా పాలనగాడిన పడలేదు. వీటిలో ప్రక్షాళన జరిగితే తప్ప చంద్రబాబు మార్కు 4.0 పాలన సాధ్యం కాదని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్



కౌన్సిలింగ్ గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్న సోమశేఖర్

కలికిరి, జూలై 2: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు మంగళవారం కలికిరి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్ళతో కూడిన కమిటీ అర్హులైన విద్యార్థులను పారదర్శక పద్ధతిలో ఎంపిక చేసింది. గత వారం మిగులు సీట్ల భర్తీ కోసం జిల్లా స్థాయిలో కలికిరి గురుకుల పాఠశాలలో అర్హత పరీక్షలు నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులను 1:2 నిష్పత్తిలో కౌన్సిలింగ్ కోసం ఎంపిక చేశారు. మంగళవారం బాలురకు మాత్రం కౌన్సిలింగ్‌ను పరిమితం చేశారు. బుధవారం బాలికల సీట్ల భర్తీ కోసం కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. సదుం, సత్యవేడు, ఐతేపల్లె, తంబళ్లపల్లె (అంగళ్ళు), కుప్పం పాఠశాలల్లో 6వ తరగతిలో అందుబాటులో ఉన్న 51 సీట్లు, 7వ తరగతిలో 20 సీట్లు, 8వ తరగతిలలో 36 సీట్లు, 9వ తరగతిలో 51 సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేశారు. మొదట విద్యార్థులతో పాటు హాజరైన తల్లిదండ్రులకు సీట్ల ఎంపిక విధానాన్ని గురించి కన్వీనరు, కలికిరి పాఠశాల ప్రిన్సిపాల్ వైసోమశేఖర్ అవగాహన కల్పించారు. కౌన్సిలింగ్ నిర్వహణలో సదుం, ఐతేపల్లె, సత్యవేడు, తంబళ్లపల్లె, కుప్పం, కలికిరి పాఠశాలల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు రెడ్డి, దేవి సులోచన, శ్రీనివాసులు, రామాంజనేయ రెడ్డి, సరోజ, సోమశేఖర్‌లు పాల్గొన్నారు.

అన్నమయ్య కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్

- అభిషిక్త్ కిశోర్ బదిలీ



నూతన కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్‌ను నియమిస్తూ మంగళవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న అభిషిక్త్ కిశోర్‌ను బదిలీ చేసింది. ప్రస్తుతానికి ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ ఏడాది జనవరిలో ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ గిరీషాను ప్రభుత్వం సస్పెండు చేసింది. దీంతో అభిషిక్త్ కిశోర్ జనవరి 30వ తేదీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. దాదాపు ఎటువంటి సంఘటనలు, వివాదాలు, ఆరోపణలు లేకుండా ఎన్నికలను నిర్వహించారు. కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించామని, సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

2016 బ్యాచ్ ఐఏఎస్

అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా వస్తున్న శ్రీధర్ తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన వ్యక్తి. హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ (ఈఈఈ) పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. 2016లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత నెల్లూరు జిల్లా కావలిలో సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా శీతంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా ఒకటిన్నర సంవత్సరం పని చేశారు. తర్వాత చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా మొదట బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తూర్పుగోదావరి జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. సీసీఎల్ఏలో విజిలెన్స్‌లో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా 15 నెలల నుంచి పనిచేస్తున్నారు. శ్రీధర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో వెంకటలక్ష్మికి పింఛన్ ఇస్తున్న దృశ్యం

చిన్నమండెం, జూలై 2: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి అక్కడికే వెళ్లి మంగళవారం పింఛన్ అందచేశారు సచివాలయ సిబ్బంది. వివరాలిలా ఉన్నాయి. మల్లూరు గ్రామ పంచాయతీలో ఉన్న వెంకటలక్ష్మి (70) పక్షవాతంతో ఇబ్బంది పడుతూ పది రోజుల నుంచి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. అయితే ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వేళ పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ అందజేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మల్లూరు డిజిటల్ అసిస్టెంట్ శ్రీహర్ష మంగళవారం రిమ్స్‌కు వెళ్లి వెంకటలక్ష్మికి 7 వేల రూపాయల పింఛన్ అందజేశారని పంచాయతీ సెక్రటరీ సుమిత్రమ్మ తెలిపారు.

ఒకే కుటుంబానికి రూ.43 వేలు

- ఒకరికి వృద్ధాప్యం, ముగ్గురు వికలాంగులు
- పింఛన్ల ఉదారతలో టీడీపీది ఆది నుంచి అగ్రపీఠమే



రామకృష్ణారెడ్డి కుటుంబంలోని నలుగురు లబ్ధిదారులు

కలికిరి, జూలై 2: మండల వ్యాప్తంగా సోమవారం నుంచి జరుగుతున్న పింఛన్ల పంపిణీలో ఒక కుటుంబానికి నిజంగానే పండుగ వచ్చినట్లయింది. ఒకే కుటుంబంలో నలుగురుండగా నలుగురికీ కలిపి ఏకంగా రూ.43 వేలు అందజేశారు. ఇందులో ముగ్గురు వికలాంగులు కాగా ఒకరికి మాత్రం వృద్ధాప్య పింఛను అందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పత్తేగడ పంచాయతీ శెట్టిపల్లివారిపల్లెలోని రామకృష్ణారెడ్డి కుటుంబానికి టీడీపీ ప్రభుత్వం పెంచిన పింఛన్లలో భాగంగా రూ.43 వేలు అందజేశారు. కుటుంబ పెద్ద రామకృష్ణారెడ్డి (75) మంచానికే పరిమితమైన పూర్తి వికలాంగుడు. గతంలో రూ.5 వేలు అందుతుండగా కొత్తగా పింఛను మొత్తాన్ని పెంచిన రూ.15 వేలకు పెంచి అందజేశారు. ఆయన భార్య రెడ్డెమ్మ (68)కు వృద్ధాప్య పింఛను గతంలో రూ.3 వేలు మాత్రం వస్తుండగా ప్రస్తుతం దానిని రూ.4 వేలకు పెంచారు. మూడు నెలలకు అదనంగా మరో రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు అందజేశారు. ఇక అదే ఇంట్లో ఉంటున్న ఆయన కుమార్తె, అల్లుడు కూడా వికలాంగులే. అందులో అల్లుడు శ్రీనివాసులు వంద శాతం వికలాంగుడు కావడంతో అతడికి కూడా గతంలో రూ.5 వేలు అందేది. కొత్త ప్రభుత్వం దీనిని కూడా పెంచడంతో ప్రస్తుతం రూ.15 వేలు అందజేశారు. ఇక కుమార్తె లలిత పూర్తిగా చెవుడు, మూగ. ఈమెకు గతంలో రూ.3 వేలు అందుతుండగా తాజా పెంపుదలతో రూ.6 వేలు అందజేశారు. ఈ మొత్తం నలుగురికీ కలిపి రూ.43 వేలు సచివాలయం ఏఎన్ఎం పార్వతి ఒకే దఫాగా అందజేయడంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. ఇంత పెద్ద మొత్తం తామెన్నడూ ఊహించి ఎరుగమని తమ నలుగురి జీవనోపాధి ఇక నుంచి సాఫీగా జరిగిపోతుందని ఆనందం వ్యక్తం చేశారు.



అర్హత ఉన్నా పింఛను అందని యానాది కుటుంబాలకు చెందిన సుబ్బు, సోము

అర్హత ఉన్నా పింఛన్లు అందని యానాదులు

రూ.43 వేలు ఏక మొత్తంగా పింఛన్ల రూపంలో అందుకున్న రామకృష్ణారెడ్డి కుటుంబాన్ని పలకరించడానికి చేసిన ప్రయత్నంలో అక్కడే ఇద్దరు యానాది కుటుంబాలకు చెందిన వారికి పింఛన్లు అందకపోవడం ఆంధ్రజ్యోతి దృష్టికొచ్చింది. ఎలాంటి ఆస్తిపాస్తులు, చదువులూ లేని ఈ ఇరువురు యువకుల్లో ఒకరైన సుబ్బు (20) తల్లిదండ్రులు లేని అనాథ. అంతేగాకుండా శారీరకంగా కూడా వైకల్యంతో ఉండటంతో సాటి కులస్తులు పెడుతున్న తిండితో కాలం నెట్టుకొస్తున్నాడు. ఇక రెండో యువకుడు సోము (25) పూర్తిగా మానసిక వైకల్యుడు. ఎలాంటి పనిచేయడానికి వీలుకాని వీరిద్దరికీ అసలు ప్రభుత్వ పింఛన్లు ఇస్తున్న విషయం కూడా తెలియదు. వీరిని ఏదో విధంగా కొత్త ప్రభుత్వమైనా ఆదుకోవాలని సాటి యానాది కుటుంబాలు కోరుతున్నాయి.

పింఛన్ల విషయంలో ఆది నుంచి టీడీపీదే ఉదారత

పింఛన్ల విషయంలో మొదటి నుంచి టీడీపీ ప్రభుత్వాలు ఉదారంగా వ్యవహరించడం పరిపాటిగా ఉంది. సామాజిక భద్రతా పింఛన్ల పేరుతో 1984లో సీఎంగా ఉన్న ఎన్టీఆర్ ఈ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. 75 ఏళ్ల పైబడిన వృద్ధులకు నెలకు రూ.30 మాత్రం అందజేసేవారు. ఒక్కో పంచాయతీకి కేవలం నలుగురైదుగురు లబ్ధిదారులు మాత్రమే ఉండే వారు. స్థానిక పోస్టాఫీసుల ద్వారా పింఛన్ల బట్వాడా జరిగేది. 1997లో చంద్రబాబు సీఎంగా ఉండగా ఈ మొత్తాన్ని రూ.75కు పెంచారు. అంతకు ముందు వరకూ వృద్ధులకు మాత్రమే పరిమితం కాగా వితంతువులు, వికలాంగులకు కూడా పింఛను పథకాన్ని విస్తరించారు. వీరితో పాటు వీరితో పాటు చేనేత, కల్లుగీత కార్మికులకు కూడా చంద్రబాబు పింఛన్లు ప్రకటించారు. దీంతో పింఛన్లు పొందడానికి గ్రామాల్లో పోటీ మొదలైంది. అనంతరం 2004లో వైఎస్ఆర్ సీఎంగా ఉండగా పింఛన్ల మొత్తాన్ని రూ.200లకు పెంచారు. ఆ తరువాత పదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎలాంటి పెంపుదల లేదు. 2014లో తిరిగి చంద్రబాబు నాయుడు సీఎం కాగానే పింఛన్ల మొత్తాన్ని రూ.200 నుంచి ఏకంగా రూ.1000కి పెంచారు. అదే విధంగా 2019లో ఈ మొత్తాన్ని తిరిగి రూ.2 వేలకు పెంచి పంపిణీ చేశారు. ఈ మధ్యలో కిడ్నీ బాధితులు, ట్రాన్స్‌జెండర్లు, మత్స్యకారులు, చెప్పులు కుట్టేవారు, పక్షవాత రోగులు, డప్పు కళాకారులు, ఒంటరి మహిళలు, వంద శాతం వికలాంగులు, ప్రమాద బాధితులు ఇలా మొత్తం పింఛన్లను 26 వర్గాలకు విస్తరించారు. 2019 ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్ పింఛను మొత్తాన్ని రూ.2 వేల నుంచి మూడు వేలకు పెంచుతానని హామీ ఇచ్చినా దానిని ఏడాదికి ఒకసారి చొప్పున విడతలవారీగా పెంచి పింఛనుదార్లను తీవ్ర నిరాశకు గురి చేశారు. కొత్తగా కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వంలో సాధారణ పింఛన్లను రూ.4 వేలకు పెంచడంతోపాటు ఇతర వ్యాధిగ్రస్తులకు రెండింతలు పెంచి పంపిణీ చేశారు. మొత్తం మీద టీడీపీ ప్రభుత్వాల్లోనే అదీ చంద్రబాబునాయుడు సీఎంగా ఉండగానే పింఛన్ల విషయంలో అత్యంత ఉదారంగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. హామీ ఇచ్చిన నాటి నుంచి మూడు నెలల పింఛను మొత్తాలను కలుపుకుని తాజాగా పంపిణీ చేయడంతో పింఛన్‌దారులు ఆనందంగా ఉన్నారు.

302 బస్తాల యూరియా సీజ్

- సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.8.56 లక్షలు



గోడౌన్‌లో అనుమతులు లేకుండా ఉంచిన ఎరువులు, విత్తనాల బస్తాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ శివశంకర్, తదితరులు

గుర్రంకొండ, జూలై 2: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న యూరియా, వివిధ రకాల ఎరువులు, మందుల బస్తాలను సీజ్ చేసినట్లు మదనపల్లె ఏడీఏ శివశంకర్ తెలిపారు. గుర్రంకొండ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అమ్ముతున్నట్లు జిల్లా అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విజయ ఫర్టిలైజర్స్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 302 బస్తాల యూరియాను సీజ్ చేశారు. సీజ్ చేసిన యూరియా విలువ రూ.80,483లుగా నిర్ధారించారు. అలాగే మరో ఎరువుల దుకాణమైన జువారి ఫర్టిలైజర్స్‌లో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న రూ.7.76 లక్షల విలువ గల 28 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన మొత్తం ఎరువుల విలువ రూ.8.56 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయించరాదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గుర్రంకొండలో నకిలీ ఎరువులను విక్రయించే వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. రైతులు కొన్న ప్రతి వస్తువుకు వ్యాపారులు బిల్లులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో నవీన్‌రెడ్డి, ఏఈవో అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన ఎప్పుడో..?



- వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నాన్ టీచింగ్ పోస్టులనియామకాల్లో గోల్‌మాల్
- రూ.8లక్షల నుంచి రూ.10 లక్షలకు అమ్ముకున్న వైనం
- వైసీపీ అనుయాయులకే పెద్దపీట

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో యోగివేమన, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలలో అక్రమాలు జరిగాయనే విమర్శలున్నాయి. ముఖ్యంగా ఈ రెండు చోట్ల నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవి వైసీపీ అనుయాయులకు, అనుచరులకు పునరావాస కేంద్రాలుగా మారాయనే విమర్శ ఉంది. ఇక్కడ కొన్ని పోస్టులు ఏకంగా అమ్ముకున్నారంటూ వైసీపీ నేతలే విమర్శించారు. యూనివర్శిటీ పోస్టులలో తమకు ప్రాధాన్యత లేకుండా ఒక్కో ఉద్యోగాన్ని 8 నుంచి 10 లక్షల రూపాలయకు అమ్ముకున్నారంటూ ఎన్నికల్లో ఓటమి తరువాత కడప అసెంబ్లీపై సమీక్ష సందర్భంగా పలువురు కార్పొరేటర్లు ఎంపీ అవినాశ్ వద్ద వాపోయారు. దీనిని బట్టి చూస్తే నాన్ టీచింగ్ పోస్టుల నియామకాల్లో ఎంత అక్రమాలు జరిగాయో అర్థమవుతుంది. వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీల్లో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమాల గుట్టు రట్టు చేయాలంటూ విద్యార్థి సంఘాల నేతలు పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లపాలనలో వైవీయూలో చోటు చేసుకున్న అక్రమ నియామకాలు, ఇతరత్రా వాటిపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది.

వివాదాలకు కేంద్రాలు

ఒకప్పుడు విశ్వవిద్యాలయాల్లో స్టూడెంట్స్ యూనియన్లకు ప్రాధాన్యం ఉండేది. యూనియన్ల మధ్య ఎన్నికలు జరిగేవి. అప్పట్లో ప్రభుత్వాలు యూనియన్లతో ఎంత అవసరమో అంతమేరకే జోక్యం చేసుకునేవి. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక ఆ సంప్రదాయాలన్నీ మారిపోయాయి. యూనివర్శిటీల్లోకి రాజకీయాలు ఎంట్రీ ఇచ్చాయి. ఇక పోటీ పడి మరీ భజన చేసే బ్యాచ్ కూడా యూనివర్శిటీలో తిష్ట వేసింది. వెరసి ఎక్కడా లేని విధంగా అక్కడ అధికార యంత్రాంగం వైసీపీకి దాసోహం అయినట్లు విమర్శలున్నాయి. యోగివేమన, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాలను వైసీపీ పునరావాస కేంద్రాలుగా మార్చారనే విమర్శలున్నాయి. జిల్లాలో ఇప్పటిదాకా వైవీయూ, ఆర్కిటెక్చర్, రిమ్స్ అంటే ఇవన్నీ వైఎస్ కుటుంబానికి ఆస్తులు అని వైసీపీ నేతలు భావిస్తుంటారు. అక్కడ వారికి అనుకూలురను నియమించుకుని అలాగే నియామకాలు చేపట్టారనే విమర్శలున్నాయి.

- వైవీయూలో జగన్ జమానాలో సుమారు వంద మందికి పైగా బోధనేతర సిబ్బందిని ఇష్టారాజ్యంగా నియమించారనే విమర్శలున్నాయి. కొన్ని ఉద్యోగాలు పులివెందుల సిఫారసులతో సృష్టించి నియమించగా మరికొన్ని ఉద్యోగాలను కడప నేతలు ఒక్కో పోస్టును పదిలక్షలకు అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకుండా అవసరానికి మించి నాన్ టీచింగ్ స్టాఫ్ అయిన స్వీపర్స్ డ్రైవర్స్ ఇతర ఉద్యోగాల్లో తమవారిని నియమించి వైసీపీ పునరావాస కేంద్రంగా మార్చారనే విమర్శ ఉంది. ఇక కీలక అధికారులే వైసీపీకి భజన చేస్తుండడంతో ఇక్కడ నియామకాలు రెండో కంటికి తెలియకుండా జరిగాయంటారు.
- ఇక వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో కూడా అడ్డగోలుగా నియామకాలు చేశారంటారు. ఇక్కడ కూడా భారీ సంఖ్యలో చేపట్టారనే విమర్శ ఉంది. ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఈసీ సురేంద్రనాథరెడ్డి, వైవీయూ వీసీలుగా పనిచేసిన సుధాకర్, సూర్యకుమారిల అక్రమాలపై సీఐడీ విచారణ చేయించాలంటూ పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం అడ్డగోలు నియామకాలు, నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చదువులకు పెద్దపీట వేయాల్సిన విశ్వవిద్యాలయాల్లో వైసీపీ పాలిటిక్స్‌కు ప్రయార్టీ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

రెండో రోజు కొనసాగిన సర్టిఫికెట్ వెరిఫికేషన్



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 2: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 2వ రోజు కొనసాగింది. మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో సైనిక సంతతికి చెందిన విద్యార్థులు 62 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 113 మంది మొత్తం 175 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు అయ్యారు. అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, బుధవారం సైనిక సంతతికి చెందిన విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొఫెసరు తుమ్మలకుంట శివప్రతాప్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంటు, రాయల్టీఇన్‌స్ట్రక్టర్ జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఈనెల 10లోపు విద్యార్థులు తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ...ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారు

చెన్నూరు, జూలై 2: మండలంలోని పాత టోల్‌గేటు వద్ద సోమవారం రాత్రి ఓ ఆటోను లారీ ఢీకొనడంతో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నూరు వాసి తాజుద్దీన్ కుటుంబం కొన్నేళ్లుగా కడపలో ఉంటోంది. సోమవారం చెన్నూరులోని వారి ఇంట్లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి రాత్రి ఆటోలో వెళుతుండగా పాత టోల్‌గేటు వద్ద వెనుక వైపు నంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న షమీఉన్నీసా (40), ఆయేషా (35), తహరున్నీసా (37), చిన్నారులు ముస్తాన్ (13), ఖవ్వాజ్ (10), మెహర్ (7)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రిమ్స్‌కు తరలించగా.. స్థానికులు కడపలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఫవాజ్, మెహర్ పరిస్థితి విషమంగా ఉంది. కాగా సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నెలలో ఇది నాలుగో ప్రమాదం

పాత టోల్‌గేటు వద్ద గతంలో ఉన్న లైట్లు, డివైడర్లను తొలగించారు. దీంతో రోడ్డు వెడల్పు ఎక్కువగా ఉండడంతో వాహనాలు అతి వేగంతో దూసుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు ఎటు వైపు వెళుతున్నారో అర్థం కాని పరిస్థితుల్లో ప్రమాదాలు జరగుతున్నాయి. సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంతో కలిసి కేవలం 20 రోజుల్లోనే నాలుగు ప్రమాదాలు జరిగాయి. 20 రోజుల కిందట ఓ మహిళ, ఆమె మరిది కొడుకు మృతి చెందారు. ఆ తరువాత ఐదురోజులకు ఓ లారీ డ్రైవరు మృతి చెందగా, ఆ వెంటనే మరో ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇక్కడ ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని పలువురు వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు హైవే అధికారులు కానీ, రోడ్డు రవాణా ఉన్నతాధికారులు కానీ తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై ప్రతి ఒక్కరూ మండిపడుతున్నారు.

యువతి ఆత్మహత్య

పెండ్లిమర్రి, జూలై 2: మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెదిన బత్తల వెంకటలక్ష్మి (24) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. వెల్లటూరు గ్రామ పంచాయతీలోని పెద్దదాసరిపల్లె చెరువులో రేగుచెట్టుకు ఓ యువతి ఉరి వేసుకొని మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ హరిప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించారు. రెండు వారాల కిందట ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రిమ్స్ డాక్టర్లు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీ.. సైకిలిస్టు మృతి

కడప (క్రైం), జూలై 2: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో వేగంగా వచ్చిన కారు సైకిలిస్టును ఢీకొనడంతో ఎల్లంపల్లె పరశురాం బర్నీబాస్ (68) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కడప మరియాపురానికి చెందిన బర్నీబాస్ మంగళవారం సైకిలుపై బిల్టప్ సైడ్ వెళుతుండగా తెలుగుగంగ వైపు నుంచి కడపకు వస్తున్న కారు సైకిలును ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిలిస్టుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్



రామాపురం, జూలై 2: మండలంలోని రాచపల్లి పంచాయతీ మంగళపల్లె వద్ద మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రామాపురం ఎస్ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లపై చర్యలు చేపట్టాలి

- అఖిల పక్ష నేతలు డిమాండ్



వినూత్న రీతిలో అవినీతి అధికారులకు పాలాభిషేకం చేస్తున్న అఖిలపక్ష నేతలు, ప్రజా సంఘాలు

కడప(కలెక్టరేట్), జూలై 2: జిల్లాలో భూ కుంభకోణాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు తోడ్పాటునందించిన జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అవినీతి అధికారులైన జిల్లా రిజిస్ట్రార్ పీఎన్ బాబు, సబ్ రిజిస్ట్రార్ సుందరేశన్‌పై చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ వారి ఫొటోలకు పాలభిషేకం చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నేత ఆంజనేయులు మాట్లాడుతూ వంకలు, వాగులు, తెలుగు గంగ భూములు, రైల్వే భూములను వదలకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయడం వెనక జిల్లా రిజిస్టర్ పాత్ర ఉందన్నారు. ఇలాంటి భూములను రిజిస్టర్ చేస్తే వచ్చే కమీషన్‌లో 60:40 వాటాలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారని ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్ణ నాగయ్య భూము లను మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అనుచరులు కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయాలపై గతంలో ఉన్న కలెక్టర్, ప్రస్తుత కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. సాక్షాత్తు డిప్యూటీ మేయిర్ పోలీసుల భూములను లాగేసుకున్నా పట్టించుకునేవారే లేరన్నారు. ఈ నెలాఖరున ప్రజా సంఘాలు, పార్టీలతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి కబ్జా భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించే వరకు పోరాడతామని హెచ్చ రించారు. గతంలో నారా లోకేశ్‌బాబు భూకుంభ కోణాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిగా ఆ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన రిజిస్ట్రేషన్ల అక్రమాలపై సబ్‌రిజిస్ట్రార్ సుందరేశన్‌పై రిపోర్టులు రాసినా వారిపై చర్యలు తీసుకోవాల్సిన కలెక్టర్ ఉదాసీనంగా వ్యవహరిం చడం దారుణమన్నారు. తక్షణం బుగ్గవంక భూములు 42 ఎక రాలు, రైల్వే, వంకలు, వాగులు ఆక్రమణలను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయ కులు అవ్వారు మల్లికార్జున, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపై ఓపెన్ ఫోరంలో అధికారుల నిలదీత



ఉపాధిలో అక్రమాలపై అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

సికెదిన్నె, జూలై 2: సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి అవినీతిపై అధికారులను ప్రజలు నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంతో పేదలకు పని కల్పించి వారి కుటుంబానికి ఉపాధి కల్పిస్తోంది. అయితే కొందరు ఉపాధి హామీ సిబ్బంది ఉపాధి నిధులను అక్రమ మార్గంలో పొందేందుకు పనికి రానివారికి సైతం జాబ్‌కార్డులు సృష్టించి పని కల్పించినట్లు రికార్డులో చూపి ఆ నిధులు కూడా కాజేస్తున్న ఘనులు మండలంలో అనేక మంది ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని ఓ చిన్న పంచాయతీలోని చిన్నగ్రామంలో సర్పంచ్, కుటుంబ సభ్యులు అతని అనుచరుల కుటుంబ సభ్యుల పేరుతో ఏడాదిలోనే దాదాపు రూ.6 లక్షలు నిధులు కాజేసినట్లు మంగళవారం జరిగిన ఓపెన్ ఫోరంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 23 మంది పేర్లతో అవినీతి చేసినట్లు తెలుస్తోంది. ఐదేళ్లగా ఇదేతంతు నడుస్తున్నట్లు గ్రామస్తులు అధికారులకు తెలిపారు. మైక్రో ఏటీఎం ద్వారా బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్లు ఉపాధి కూలీలు నిరక్షరాస్యులను ఆసరాగా చేసుకుని స్మార్ట్‌ఫోన్ లేనివారిని ఎంచుకుని వారికి తక్కువ కూలి వచ్చిందని తెలిపి దాదాపు ఒక్కొక్కరి నుంచి 8 నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు ఆరోపించారు. ఈ విషయం కాస్త ఉపాధి కూలీలకు తెలియడంతో తమ డబ్బు కొట్టేస్తారని లబోదిబోమంటున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉండే ఓ పెద్ద పంచాయతీలో పనిచేసే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అన్నీ తానై అధికారులందరినీ బెదిరిస్తూ ఉపాధిలో తను చెప్పిందే వేదంగా నడిపిస్తుండేవాడని వివరించారు. ప్రభుత్వం మారడంతో అన్ని పంచాయతీల్లోని ఉపాధి అవినీతిని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో అంతా బట్టబయలైంది. దీంతో అధికారులు విచారించి రికవరీ చేయడం, వారిని తొలగిస్తామని తెలపడంతో ప్రజలు శాంతించారు. కార్యక్రమంలో అడిషనల్ డ్వామా పీడీ నాగరత్నమ్మ, డీఆర్‌డీఏ ఏపీఓ ప్రసాద్‌రావు, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ షకీలాబేగం, ఏపీఓ రామాంజులరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి భాస్కర్, కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థపై ప్రతికూల ప్రభావం

- బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గురప్ప

కడప(రూరల్) జూలై 2: భారతదేశంలో కొత్త క్రిమినల్ చట్టాల అమలు న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉందని కడప బార్‌అసోసియేషన్ అధ్య క్షుడు బొగ్గుల గురప్పనాయుడు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల అమలును వ్యతిరేకిస్తూ మంగళవారం కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల స్థానంలో తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాలు పౌరుల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నేర న్యాయచట్టం వలన పోలీస్‌కు అత్యధిక ప్రాధాన్యత కల్పించి.. పౌరుల ప్రాథమిక హక్కులను హరించేలా ఉందన్నారు. దీంతో పోలీస్ రాజ్యాంగం ఏర్పడే అవకాశం ఉందని తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ చట్టాల వలన బాధితులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఇదివరకు జ్యుడీషియల్ కస్టడీ 14 రోజుల వరకు ఉండేదని.. కొత్త చట్టాల వలన 60 రోజుల నుంచి 90 రోజులు ఇవ్వడంతో సుదీర్ఘ కాలం జైల్లో ఉండాల్సి వస్తుందన్నారు. కొత్త చట్టాలకు హిందీ పేర్లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కొత్త చట్టాల్లోని ఇబ్బందికరమైన అంశా లను మార్పుచేసి పౌరుల ప్రాథమిక హక్కులకు భంగంలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ నేతలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అనేక సేవలు



వన్‌స్టాప్ సెంటర్‌లో రిజిష్టర్లను పరిశీలిస్తున్న జడ్జి

కడప(రూరల్) జూలై 2: ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్‌సెంటర్ ఆపన్న హస్తమని.. ఇక్కడ ఒకేచోట అనేక సేవలు అందుతాయని డీఎల్ ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫ్కుద్దీన్ పేర్కొన్నారు. కడప నగరం రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్‌సెంటర్‌ను మంగళవారం జడ్జి విజిట్ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడ లభిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాఫ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌స్టాఫ్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, తదితర సేవలు లభిస్తున్నాయన్నారు. వన్‌స్టాఫ్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఫోర్స్ బస్సులు



తేజోమూర్తికి బస్సు కీస్ అందజేస్తున్న శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్

రేణిగుంట, జూలై 2: తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శ్రీ దుర్గా ఫోర్స్ షోరూమ్‌లో మంగళవారం ఫోర్స్ స్కూల్ బస్సులను మార్కెట్లోకి విడుదల చేశారు. వీటిని చిత్తూరుకు చెందిన విజయం గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత తేజోమూర్తి మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్, ఫోర్స్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ నుంచి 55 సీట్ల కెపాసిటీతో స్కూల్ బస్సులను విడుదల చేశామన్నారు. మోనోకోక్ బాడీతో ఉన్నతమైన పారాబోలిక్ సస్పెన్షన్‌తో ప్యాసింజర్లకు కారులో తిరిగే అనుభూతితో మంచి మైలేజి కలిగి ఉండటం ఈ బస్సుల ప్రత్యేకత అని చెప్పారు.

5 నుంచి 11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప(ఎడ్యుకేషన్), జూలై 2: విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 5 నుంచి 11వతేదీ వరకు రద్దయినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఎ.జనార్దన్ తెలిపారు. విశాఖపట్టణం నుంచి కడప మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488) ఈ నెల 5 నుంచి 10 వరకు, అలాగే కడప నుంచి విశాఖ మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ 6 నుంచి 11 వరకు రద్దయిందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని కోరారు.

రీసర్వేతో రైతులకు తిప్పలు

- 1బీలో కనిపించని భూవిస్తీర్ణం
- రైతులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు



మా భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని చూపుతున్న రైతులు

చక్రాయపేట, జూలై 2: గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కారణంగా రైతులకు తిప్పలు తప్పడం లేదు. రీసర్వే కారణంగా 1బిలో భూవిస్తీర్ణం కనిపించకపోవడంతో రుణాల రెన్యువల్స్ నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎవరి భూములు ఉన్నాయో, ఎవరి భూములు లేవో తెలియడం లేదు. ఓ వైపు సకా లంలో రెన్యువల్స్ చేయకుంటే రాయితీలు రావని బ్యాంకులు అంటున్నారు. దీంతో రైతులు సచివాలయాలకు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని గండి కొవ్వూరు, చక్రాయపేట, మారెళ్లమడక, అద్దాలమర్రి, కుమార్లకాల్వ, నెర్సుపల్లె, మహేశ్వరపల్లె, కె.రాజుపల్లె, గొల్లమిట్ల గ్రామాల్లో రీసర్వే జరిగింది. కానీ ఎరబొమ్మనపల్లె, సురభి, కుప్పం, ఎర్రగుడి, చిలేకాంపల్లె, కల్లూరుపల్లె గ్రామాల్లో రీసర్వే జరగలేదు. రీసర్వే జరగని గ్రామాల్లో రైతులకు ఎలాంటి సమస్య లేదు. 1బీ, అడంగల్ అన్నీ వస్తున్నాయి. కానీ రీసర్వే జరిగిన గ్రామాల్లో మాత్రం అడంగల్, 1బీలు రాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అధికారులు మాత్రం మా సమస్యను పట్టించుకోకుండా చుక్కలు చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరి భూములు ఒకరికి, తొమ్మిది ఎకరాలు ఉన్న రైతుకు కేవలం ఒకటిన్నర ఎకరా ఆన్‌లైన్‌లో కనిపి స్తోంది. మరికొందరికి పదెకరాలు ఉంటే 9.10 ఎకరాలు చూపిస్తోంది. యార్ల వాండ్లపల్లెకు చెందిన చెన్నయ్య అనే రైతుకు 2.39ఎకరాల భూమి ఉండగా కేవలం 2.01 సెంటు కనిపిస్తోంది. గంగయ్యకు 1.60ఎకరాలు ఉంటే కేవలం 0.60 సెంట్లు చూపిస్తోంది. బాలయ్యకు ఎకరా భూమి ఉంటే 9.10ఎకరాలు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఇలా రైతులకు సంబంధించి భూములు తారుమారు అయిపోయాయి. దీనికి తోడు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం ఇటీవల రీసర్వే రద్దుచేసినా.. జీఓ రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మ్యుటేషన్ చేసుకోవాలన్నా, పాస్‌బుక్కులు రావాలన్నా, పేర్లు మార్చాలన్నా, వెబ్‌సైట్ ఓపెన్ అయ్యే వరకు రైతుకు కష్టాలే. గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ రాజసింహనరేంద్ర భారీగా అవకతవకలకు పాల్పడి ఒకరి భూములు ఒకరికి ఎక్కించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి త్వరగా వెబ్‌సైట్ ఓపెన్ చేయించి తమ భూములు తమకు దక్కేలు చూడాలని రైతులు కోరుతున్నారు.

మన్నూరు భవిత కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సమ్మిళిత విద్యాశాఖాధికారి జనార్దన్

రాజంపేట టౌన్, జూలై 2: పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత కేంద్రా న్ని మంగళవారం జిల్లా సమ్మిళిత విద్య సమన్వయ అధికారి జనార్దన్ తనిఖీ చేశారు. రాజంపేట, నందలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వే కోడూరు, పెనగలూరు, చిట్వేలి మండలాల్లోని దివ్యాంగుల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందజేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, వీల్‌చైర్‌లు, సంక కర్రలు, సీపీ చైర్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ముందుగా భవిత కేంద్రాలను తనిఖీ చేసి అర్హుల వివరాలను సేకరిస్తున్నామ న్నారు. 6-18 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లలకు ఈ పరికరాలు అందజేయడానికి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, రేషన్‌కార్డులు తదితర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 8897678859, 9948757123 నంబర్లలో విద్యా రీసోర్స్‌పర్సన్‌లు మాధవి, నాగమణిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియో థెరపిస్టు రమేష్‌కుమార్, అధికారులు వెంకయ్య, రంగస్వామి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం నల్లారితో బీజేపీ నేతల భేటీ



మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో రాజంపేట బీజేపీ నేతలు

రాజంపేట, జూలై 2: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు, కిరణ్ కుమార్, బాలాజీ, హరి ప్రసాద్, నాగరాజు తదితరులు ఆయన కార్యాలయంలో కలిసి ఇటీవల జరిగిన రాజంపేట పార్లమెంట్ ఎన్నికల్లో లోటుపాట్లపై చర్చించు కున్నారు. ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను ఓటమి పాలైనా రాజంపేట పార్లమెం ట్ పరిధిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని, బీజేపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

టీఎన్‌యూఎస్ కార్యవర్గం ఎన్నిక



అన్నమయ్య జిల్లా టీఎన్‌యూఎస్ నూతన కమిటీ నేతలు

రాయచోటిటౌన్, జూలై 2: అన్నమయ్య జిల్లా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక కొత్తపేటలోని వైష్ణవి స్టడీ సెంటర్‌లో టీఎన్‌యూఎస్ గౌరవాధ్యక్షుడు సీఆర్‌వీ సుబ్రమణ్యం, అన్నమయ్య జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని ఉపాధ్యాయుల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ అధ్య క్షుడుగా సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, కోశాధికారిగా సుధాకర్ తో పాటు జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. పూర్తిస్థాయి కమిటీని అతి త్వరలో ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తా మని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీ సభ్యులు తెలియజేశారు.

రహదారుల్లో సూచిక బోర్డుల ఏర్పాటు

సిద్దవటం, జూలై 2: మాధవరం గ్రామ పంచాయతీ ప్రధాన రహదారి పక్కన ఉన్న రహదారుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎవరైనా గ్రామంలోని సమస్యలపై ఫోన్ చేస్తే వెంటనే అక్కడికెళ్లి ఆ ప్రాంతాన్ని గుర్తించేందుకు ప్రతి వీధిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, వైద్య పరీక్షల నిమిత్తం ప్రజలు కంప్లైంట్ చేస్తే 108 వాహనం వెళ్లేందుకు వీలుగా నెంబర్లు కూడా వేశామన్నారు. వీఆర్‌వో ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌బాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి విరాళం

చిట్వేలి, జూలై 2 : మండల పరిధిలోని స్తంభారాయుడు ఆలయం సమీపంలో నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి గాంధీనగర్‌కు చెందిన కోటకొండ కృష్ణయ్య, యానాదమ్మ కుటుంబ సభ్యులు మంగళవారం రూ. 30,116, కోడూరు మండలం సరమనుపోడు వడ్డిపల్లెకు చెందిన కీ.శే బత్తల వెంకటయ్య కుమారుడు చంద్రమౌళి 10,116 విరాళం అందించినట్లు ఆలయ నిర్మాత, ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు తెలియజేశారు.

‘అవుట్‌సోర్స్’ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఓబులవారిపల్లె, జూలై 2 : ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడికి పోరాట కమిటీ జేఏసీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాటకమిటీ జేఏసీ కన్వీనర్ రేకులకుంట వెంకటేశ్ మాట్లాడుతూ ఏపీఎండీసీలో సుమారు 15 ఏళ్లుగా పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. వీరందరూ ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి ఇళ్లను, భూములను ఇచ్చి సంస్థ అభివృద్ధిలో భాగం అయ్యారని, వీరి ఉద్యోగాలను పర్మనెంట్ చేయకుండా గత ఎండీ దొడ్డిదారిన జీవో 39 తీసుకు వచ్చి 151 పోస్టులు భర్తీ చేయాలని చూశాడని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి నిర్వాసిత కార్మికుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న సుమారు 400 పర్మనెంట్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ ట్రైనీ కార్మికులతో భర్తీ చేసి ఆదుకోవాలని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అమలులో అన్యాయం జరిగిందన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నేరుగా ఏపీఎండీసీ సంస్థే జీతాలు చెల్లించాలని కోరారు. ఇందుకు స్పందించి ముక్కా రూపా నందరెడ్డి మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగంపేట గ్రామ పెద్ద మనుషులు, ఏపీఎండీసీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ నారదాసు సుబ్బరాయుడు, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బండారు భాస్కర్, పోరాట కమిటీ జేఏసీ నాయకులు, సుమారు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

సీపీవోతో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భేటీ

ఓబులవారిపల్లె: నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగంపేట ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంగంపేటలో పనిచేస్తున్న అవుట్‌సోర్స్ కాంట్రాక్ట్ రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ శశికళ

రామాపురం, జూలై 2: స్టాప్ డయేరియాపై ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లోని తల్లులకు, ప్రజలకు అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శశికళ ఆదేశించారు. మండలంలోని చిట్లూరు సెక్టారులోని పక్కీరుపల్లెలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతూ, సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పిల్లలకు అక్షరాభ్యాసం, సీమంతాలు, గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించడం మంచి పద్ధతన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీడీపీవో మండల సూపర్‌వైజర్లు సుజాత, పద్మజ, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

సుండుపల్లె: శుభ్రత, ఓఆర్ఎస్‌తో డయేరియాను నివారించ వచ్చునని డీఐఎంవో రియాజ్‌బేగ్ తెలిపారు. మంగళవారం మండలంలోని బీజీ రాచపల్లె ప్రాథమిక వైద్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల సర్వే నిర్వహించి సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలియజేశారు. ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బాలింతల సంరక్షణను పాటించాలని తెలియజేశారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: అతిసార వ్యాధి నివారణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ వైద్యులు శరత్‌కమల్, కార్తీక్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అతిసార సోకిన పిల్లలకు జింక్ మాత్రలు ఇవ్వాలని, ఐదేళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులకు గ్రూప్ మీటింగ్‌లు నిర్వహించి, అవగాహన కల్పించాలని తెలియజేశారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీఆర్‌సీకి టీడీపీ నేతల అభినందన





ఎమ్మెల్సీ అభ్యర్థులు సి.రామచంద్రయ్య, హరిప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంఎల్ నారాయణ, లక్ష్మీనరసయ్య తదితరులు

రాజంపేట, జూలై 2 : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి సి. రామచంద్రయ్యను రాజంపేట టీడీపీ నేతలు అభినందించారు. ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ స్థానానికి తెలుగుదేశంపార్టీ తరఫున మంగళవారం విజయవాడలో నామినేషన్ వేస్తున్న సందర్భంగా రాజంపేటకు చెందిన టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, లక్ష్మీ నరసయ్య, పృథ్వీ, మలిశెట్టి సుబ్బరాయుడు తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.హరిప్రసాద్‌ను అభినందించారు.

అనంతరం వారు మంత్రులు నాదెండ్ల మనోహర్, ఫరూఖ్‌లను కలిశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

సుండుపల్లె, జూలై 2: మండల కేంద్రానికి స మీపంలోని జీకే రాచ పల్లె ఉన్నత పాఠశా లలో 8వ తరగతి చ దువుతున్న రమేష్ అనే విద్యార్థికి ఉపా ధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు కలిసి మంగళవారం రూ. 10,600 ఆర్థిక సాయం అందజేశారు. గుండెపోటు కారణంగా ఈ విద్యార్థి తండ్రి మరణించడంతో వారి కుటుంబాన్ని ఆదు కునేందుకు ఈ సాయం చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయులు నాగార్జున, శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ కాలేజీలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జూలై 2: ఏపీ మోడల్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఇంగ్లిష్ మీడియం బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

రాజంపేట, జూలై 2 : నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు నిరసనగా ఈ నెల 4న దేశంలోని అన్ని విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, పీడీఎస్‌యూ నాయకులు గోవర్దన్ తెలిపారు. మంగళవారం రాజంపేట పట్టణంలోని గీతాంజలి కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ కావడం దారుణమన్నారు. ఈ పరీక్షలను రద్దు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదన్నారు. దేశవ్యాప్తంగా ఈ విషయంపై ఆందోళన వ్యక్తమవుతున్నా ఇంతవరకు నీట్ పరీక్షను తిరిగి నిర్వహిస్తామని ప్రకటన ఇవ్వకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 4న దేశవ్యాప్త బంద్‌ను జిల్లాలోనూ పాటిస్తున్నామని, ఈ బంద్‌కు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె, జూలై 2 : మండల పరిధిలోని ఎరువుల అం గళ్లను రాజంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచించిన ధరలకు మాత్రమే ఎరువులు, విత్తనాలు అమ్మాలని అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతలో అనుమానం ఉంటే రైల్వేకోడూరులోని వ్యవసాయ పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించి తెలుసుకోవచ్చని తెలిపా రు. ఉచిత మినీ కిట్‌లు, హైబ్రీడ్ పొద్దుతిరుగుడు విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఏవో మల్లిక తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ గోతులు తవ్వేశారు.. వదిలేశారు

● పట్టించుకోని అధికారులు ● తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు



కేబుల్ నెట్‌వర్క్ కోసం బోడసానివాండ్లపల్లెలో తవ్విన కాలువ

గాలివీడు, జూలై 2: కేబుల్ నెట్‌వర్క్ సంస్థ నిర్వాకంతో ఓ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్తుల కథనం మేరకు గాలివీడు నుంచి నూలివీడు వరకు కేబుల్ నెట్‌వర్క్ కనెక్షన్ల కోసం రోడ్డుకు ఇరు వైపులా మీటర్ లోతు వరకు గాడి తవ్వారు. దీంతో నూలివీడు పంచాయతీ బోడసానివాండ్లపల్లెలో తాగునీటి పైపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఫలితంగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. వారం క్రితం కోసం తవ్విన గోతులు ఇంతవరకు పూడ్చకపోవడంతో ఇళ్లలోకి వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తు లు తెలిపారు.. పది రోజులుగా ఈ సమస్యను ఆ సంస్థ సూపర్‌వైజర్‌కు తెలియ జేస్తున్నా వాళ్లు పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ఎయిర్టెల్ అధికారులు స్పం దించి, దెబ్బతిన్న మంచినీటి పైపు లైన్‌కు మరమ్మతులు చేయించాలని, తొందరగా కేబుల్ లాగి, గోతులను పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కేబుల్ నెట్‌వర్క్ సూపర్‌వైజర్ సూర్యను వివరణ అడగగా కేబుల్ నెట్ కనెక్షన్ కోసం తవ్విన మాట వాస్తవమేనని, రెండు రోజుల్లో పనిని పూర్తి చేసి గ్రామ ప్రజలకు సమస్య లేకుండా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి పనులు



సుగవాసిని సన్మానిస్తున్న ఎంపీపీ రాజమ్మ

సుండుపల్లె, జూలై 2: ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి పనులు కల్పించాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం కోరారు. మంగళవారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని కొందరు టీడీపీ నాయకులు సమావేశంలో ఆరోపించారు. అనంతరం ఎంపీపీ రాజమ్మ బాల సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో అమర్‌నాథ్, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, ప్రసాద్‌రాజు, దామోదర్ నా యుడు, సురేశ్‌నాయుడు, రామనాథరెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలకు పాలతో అభిషేకం చేస్తున్న దివ్యాంగులు

పెనగలూరు, జూలై 2 : దివ్యాంగుల పెన్షన్‌ను 3 వేల నుంచి 6 వేల రూపాయ లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వివిధ ప్రతిభావంతులు మంగళవారం టీడీపీ జిల్లా అధికార ప్రతి నిధి కొత్త బాలకృష్ణ, క్లస్టర్ ఉపాధ్యాయుడు నాగినేని రాంప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో మండల టీడీపీ కార్యాలయంలో సీఎం చం ద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను పాలతో అభిషేకించారు. ఈ సంద ర్భంగా కడప తిరుపాలు అనే దివ్యాంగుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగును తీసుకువచ్చాడన్నారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ టీడీపీ నాయకులు, కమ్మ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పి.నరేష్ బాబు, పదకమూరి మురళీనాయుడు, జి.రామయ్య, జక్కల నరసింహులు, జి.యానాద య్య, కమతం జయరామయ్య, ఏనుగుల శివకుమార్, కె.పెద్దకృష్ణయ్య, చక్రంపేట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు పని వేళలు పాటించాలి



ప్రభుత్వ పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో పిల్లి నాగరాజు

గాలివీడు, జూలై 2: ఉపాధ్యాయులు పని వేళలు పాటించాలని ఎంఈవో పిల్లి నాగరాజు సూచించారు. మంగళవారం మండలంలోని ఈడిగపల్లె, రెడ్డివారిపల్లెలోని ప్రభుత్వ పాఠ శాలలను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా పాఠశాల సమయంలో పాఠశాలలోనే ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ద్వారకనాథరెడ్డి

రామాపురం, జూలై 2: మండలంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణ, కిచెన్ షెడ్, బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి పాఠశాలలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. హాస్టల్ ఆవరణలో రాత్రి సమయంలో లైటింగ్ సమస్య ఉందని, హాస్టల్ వెనుక వైపు గుట్ట ఉండడం వలన రాత్రి సమయంలో విషపురుగులు ఎక్కువగా వసతి గృహం లోకి పరిసర ప్రాంతాల్లోకి వస్తున్నాయని ఆయన దృష్టికి ఆమె తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ద్వారకనాథరెడ్డి తన సొంత నిధులతో పాఠశాల ఆవరణలో పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయిస్తానని, పాఠశాలలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఆయనతో పాటు ఆదర్శ పాఠశాల సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చిలేకాంపల్లె శావారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డ, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

చిట్వేలి, జూలై 2: మండల పరిధిలోని తుమ్మచెట్లపల్లి ఎంపీ పీ పాఠశాలలోని 30 మంది వి ద్యార్థులకు మంగళవారం గతం లో ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు మురళీమోహన్ రాజు నోటు పుస్తకాలతో పాటు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు కోదండనాయుడు, ఈశ్వరయ్య ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు కొండూరు శ్రీనివాస రాజు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, కాలేషా, హరి వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి తాగునీటి సౌకర్యం

పెనగలూరు, జూలై 2 : పెనగలూరు లోని వేణుగోపాలస్వామి దేవాలయా నికి ఇదే గ్రామానికి చెందిన చంద్రగిరి రామకృష్ణ అనే భక్తుడు తన సొంత నిధులతో బోరు వేయించి మోటారు బిగించినట్లు ధర్మకర్త జిలకర సుబ్బ య్య, ప్రధాన కార్యకర్త చెంచు సుబ్బ నరసయ్యస్వామి తెలిపారు. రామకృష్ణ కుటుంబ సభ్యులు తమ కష్టార్జితంతో దేవాలయంలో తాగునీటి సమస్య పరిష్కరించారన్నారు.

సుబ్రమణ్యస్వామికి అభిషేకం

నందలూరు, జూలై 2 : నందలూరు రైల్వే కేంద్రంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సుబ్రమణ్య స్వామికి మంగళవారం అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పూజారి సరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకం కార్యక్రమంలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలి

ఒంటిమిట్ట, జూలై 2 : డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని జనసేన పార్టీ నాయకుడు ఏలేశ్వరం మధుస్వామి కోరారు. మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, రాష్ట్రంలో గుర్తింపు పొందిన కోదండరామాలయం ఉన్న ఒంటిమిట్టలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటోందన్నారు. ఈ విషయాన్ని పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గ్రామంలో హిందూ శ్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

‘వలంటీర్ అత్తకు ఒంటరి మహిళ పెన్షన్’

● ఎంపీడీవోకు టీడీపీ నేతల ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

రాయచోటిటౌన్, జూలై 2: మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామం గుంటిమడుగుకు చెందిన గ్రామ వలంటీరు రోజా తన అత్తకు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు కావడానికి కారణమైందంటూ మంగళవారం టీడీపీ నాయకులు రాయచోటి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. వలంటీర్ రోజా తన అత్త కొక్కంటి కృష్ణమ్మ పేరు మీదట ఒంటరి మహిళ కింద పింఛన్ మంజూరు చేయించిందన్నారు. సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ విషయం గుర్తించిన టీడీపీ నేతలు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి భార్యకు పింఛన్ ఎలా వస్తుందంటూ టీడీపీ నాయకులు నిలదీశారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో అవకతవకలు జరిగేవని, ఇప్పటి ప్రభుత్వంలో అలాంటి వాటికి చోటు ఇవ్వబోమని టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటిమడుగుకు చెందిన టీడీపీ నాయకులు నాగార్జునరెడ్డి, బొట్లచెరువు వేణు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 2: స్థానిక శివాలయంలో భక్తులు స్వామివారికి హుండీలో సమర్పించిన కానుకలను మంగళవారం ఉదయం ఆలయంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, జువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. మూడునెలల 15 రోజులకు 1,50,439 రూపాయలను కానుకల రూపంలో సమర్పించారు. గోశాలలోని హుండీలో రూ.20,897లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం మధ్యాహ్నం నిర్వహించాల్సిన 15 ఆలయ గదుల వేలం పాటను వాయిదా వేసినట్లు దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ తెలిపారు.

● **4న స్వామివారి కల్యాణం..:** శివాలయంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆరుద్ర నక్షత్రం అమావాస్య సందర్భంగా మృత్యుంజయ హోమం, సాయంత్రం భస్మ హారతి నిర్వహిస్తామని తెలిపారు.

పింఛనుకోసం వైకల్యం!

● తప్పుడు ధ్రువపత్రంతో వైసీపీ నేతకు పింఛను

చిత్తూరు సిటీ, జూలై 2: ఆయన నడవగలరు. కానీ, 45శాతం వికలత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందారు. పింఛను తీసుకొంటున్నారు. మూడు చక్రాల వాహనమూ మంజూరైంది. ఆయన వైసీపీ నేత కావడంతో గత ప్రభుత్వంలో ఇదంతా జరిగిపోయింది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారం మారాక ఈ విషయం వెలుగు చూసింది. చిత్తూరు పట్టణంలోని ఈ ఘటనకు సంబంధించి స్థానికులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నగరం 20వ డివిజన్ కాజూరు వైసీపీ ఇన్‌చార్జి మహేష్‌బాబు (కాజూరు సుబ్బ) ఈ ఏడాది జనవరి నుంచి విభిన్న ప్రతిభావంతుల కోటాలో రూ.3 వేల పింఛను తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని 45 శాతం వైకల్యం ఉన్నట్లు తప్పుడు ధ్రువపత్రం పొందారని ఆరోపణలున్నాయి. తాజాగా ఈనెల టీడీపీ ప్రభుత్వం పెంచి ఇచ్చిన రూ.6 వేల పింఛనూ పొందారు. ఇక, గత వైసీపీ ప్రభుత్వంలో ఆయనకు రూ.1.25 లక్షల విలువచేసే మూడు చక్రాల యాక్టివా వాహనం కూడా మంజూరైంది. అసలు విషయం ఏమంటే.. ఆయనకు వైకల్యం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సచివాలయ ఉద్యోగులను ప్రశ్నిస్తే సర్టిఫికెట్ ఉంది కాబట్టి ఇస్తున్నామని చెప్పారంటూ స్థానికులు తెలిపారు. ఈయనకు ప్రతినెలా రూ.వేలల్లో ఇంటి అద్దెలు కూడా వస్తున్నాయని ఫిర్యాదు చేశారు.



మహేష్ బాబు (ఫైల్‌ఫొటో)

క్వారీలు, మైనింగ్ కార్యకలాపాలపై తనిఖీలకు కమిటీల ఏర్పాటు

● 10లోగా నివేదిక ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న క్వారీలు, మైనింగ్ కార్యక్రమాలపై తాజా పరిస్థితి అంచనా వేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు మండలాల్లో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలపై ఈనెల 10లోగా జేసీ శ్రీనివాసులుకు నివేదిక ఇవ్వాలని సూచించారు. వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉందన్నారు. ఈ మంగళవారం ఆయన అధికారులతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి దశ, దిశ నిర్దేశించారు. మండలాల్లోని లైసెన్స్‌డ్ క్వారీలు, అనుమతులు లేకుండా కొనసాగుతున్న అన్‌లైసెన్స్‌డ్ క్వారీలు, మైనింగ్‌లలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై ఈ కమిటీలు క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఉన్నదిఉన్నట్లు నివేదికలు ఇవ్వాలని స్పష్టంచేశారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన మండలస్థాయి కమిటీలో స్థానిక తహసీల్దార్ అధ్యక్షతన మైనింగ్, క్వారీలు, పంచాయతీరాజ్, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో, సర్వేశాఖ ప్రతినిధులు ఉంటారు. డీఆర్వో చైర్మన్‌గా వ్యవహరించే జిల్లాస్థాయి కమిటీలో మైనింగ్‌శాఖ డీడీ, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ ఈఎస్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్, సర్వేశాఖ డీడీ తదితరులు సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి కమిటీ బృందం ర్యాండమ్ తనిఖీలను మండలాల్లో చేయాలి. ఆ తర్వాత తమ తనిఖీ నివేదికలను ఈనెల 10లోగా జేసీకి అందజేయాలి.

అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం, జూలై 2: అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం దండువారిపల్లెకు చెందిన కరుణాకర్, ఉమ దంపతుల కుమార్తె హిందూప్రియకు నాలుగేళ్ల క్రితం అదే మండలం కీరమంద పంచాయతీ వేపనపల్లికి చెందిన రంగనాథన్, కుమారి దంపతుల కుమారుడు మణికంఠతో వాఆహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలంగా భర్త, అత్త, మణికంఠ అక్కలు ధనలక్ష్మి, మీనాక్షి నిత్యం కట్నం కోసం వేధించేవారు. భర్త కొట్టేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన హిందూప్రియ (26) మంగళవారం వేపనపల్లిలోని ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అత్త కుమారి, భర్త మణికంఠ, ఆడపడుచులు ధనలక్ష్మి, మీనాక్షిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న హిందూప్రియ

జూన్‌లో అధిక వర్షపాతం నమోదు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 2: జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్‌లో అధిక వర్షాలు కురిశాయి. ఈ నెలల 80.8 మి.మీ. సాధారణ వర్షపాతానికి గాను 188.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. 30 మండలాల్లో అత్యధికంగా, వి.కోటలో 91.1 మి.మీకి 101.2, వెదురుకుప్పంలో 101 మిమీకి 121 మిమీ వర్షపాతం నమోదయ్యింది. గత నెల మిగులు వర్షం వల్ల అనేక ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నెలలో సాధారణ వర్షపాతం 103.9 మి.మీ. కాగా గడచిన 24 గంటల్లో ఏడు మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. మండలాలవారీగా విజయపురంలో 10.6, తవణంపల్లెలో 6.4, నింద్రలో 6.2, శ్రీరంగరాజపురంలో 6.2, కార్వేటినగరంలో 3.8, పూతలపట్టులో 3.2, నగరిలో 2.0 మి.మీ .వర్షపాతం నమోదయ్యింది.

పాతకక్షలతో టీడీపీ నాయకుడిపై దాడి

గంగవరం, జూలై2: పాత కక్షలతో జరిగిన ఘర్షణలో టీడీపీ నాయకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డి గ్రామంలో వెళ్తుండగా, ప్రత్యర్థి వర్గానికి చెందిన దనకొండ, సుబ్రమణ్యం మందడిలు ఆయనపై దాడిచేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా గాయపడిన సుబ్రమణ్యం రెడ్డిని టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన సుబ్రమణ్యం రెడ్డి

అదుపుతప్పి మినీ లారీ బోల్తా

గంగాధరనెల్లూరు, జూలై 2: చిత్తూరు - పుత్తూరు రహదారి గంగాధరనెల్లూరు వద్ద మంగళవారం మినీ లారీ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు చెన్నై నుంచి మంగళూరుకు గ్లాస్(అద్దాలు)లోడ్‌తో వ్యాన్ బయలుదేరింది. గంగాధరనెల్లూరు దళితవాడ దగ్గర ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. వాహన చోదకుడికి గాయాలయ్యాయి. అతడిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఐచర్ వ్యానును ఆపకుండా డ్రయివర్ వేగంగా పోనిచ్చాడు. ఈక్రమంలో వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొట్టి అదుపుతప్పి బోల్లాపడింది. లారీలోని అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వ్యాన్‌లో ఎవరికీ గాయాలు తగలలేదని పోలీసులు చెప్పారు.



అద్దాల లోడ్‌తో బోల్తాపడిన వ్యాన్

మార్కెట్లోకి ఫోర్స్ బస్సులు



తేజోమూర్తికి బస్సు తాళాలు అందజేస్తున్న శివప్రసాద్

రేణిగుంట, జూలై 2: తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శ్రీ దుర్గా ఫోర్స్ షోరూమ్‌లో మంగళవారం ఫోర్స్ స్కూల్ బస్సులను మార్కెట్లోకి విడుదల చేశారు. వీటిని చిత్తూరుకు చెందిన విజయం గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత తేజోమూర్తి మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్, ఫోర్స్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ నుంచి 55 సీట్ల కెపాసిటీతో స్కూల్ బస్సులను విడుదల చేశామన్నారు. మోనోకోక్ బాడీతో ఉన్నతమైన పారాబోలిక్ సస్పెన్షన్‌తో ప్యాసింజర్లకు కారులో తిరిగే అనుభూతితో మంచి మైలేజి కలిగి ఉండటం ఈ బస్సుల ప్రత్యేకత అని చెప్పారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

గుడుపల్లె, జూలై 2: 'కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా తగ్గలేదు. ఈ క్రమంలో మా సోదరుడు కేశవ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు' అంటూ పోలీసులకు ఆయన అన్న ఫిర్యాదు చేశారు. గుడుపల్లె మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండలంలోని అయ్యవార్ల గొల్లపల్లెకు చెందిన వెంకటేష్, ప్రమీల దంపతులకు కార్తీక్(25), కేశవ(23) కుమారులు. కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట వెంకటేష్ మృతిచెందారు. కొన్ని సంవత్సరాలుగా కేశవ కడుపునొప్పితో బాధపడేవాడు. ఎన్నో ఆస్పత్రులకు వెళ్లినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం చింతతోపు సమీపంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడ తుఉన్న ఇతడిని అటుగా వెళ్తున్న గ్రామస్థులు గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. వెంటనే కేశవను పీఈఎస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాత్రికి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కేశవ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి అన్న కార్తీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి కుప్పం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



మృతుడు కేశవ (ఫైల్ ఫొటో)

సాగు భూములకు నీరందించే తీగలమ్మ చెరువు మొరవను జే న్యూటౌన్ వెంచర్ ఆక్రమణలతో మింగేసింది. గత ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి అండతో ఈ నిర్వాకం చోటు చేసుకుంది. ఈ వెంచర్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిది. నిర్వాహకులు చేసిన పనులకంతా అధికారులు 'రైట్' అని చెప్పడం తప్ప.. ఎక్కడా అడ్డుకున్న పాపాన పోలేదు. - పుంగనూరు

మొరవను మింగేశారు

● పెద్దిరెడ్డి అండతో జే న్యూటౌన్ వెంచర్ నిర్వాకం

● తీగలమ్మచెరువు నుంచి నీళ్లు పోవాలంటే ఇబ్బందికరం



తీగలమ్మ చెరువు

పుంగనూరులో ఇరుకురోడ్లు వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. అందుకని రెండేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం మదనపల్లె రోడ్డులోని భీమగానిపల్లె నుంచి పలమనేరు రోడ్డు అరబ్బిక్ కాలేజీ వరకు బైపాస్‌రోడ్డు నిర్మించింది. దీంతో బైపాస్ రోడ్డులోని భూములకు విలువ పెరిగింది. పలువురి పొలాలు వెంచర్లుగా వరాఅయి. కొందరు వ్యవసాయేతర భూములుగా మార్పు చేయకుండా, ప్రభుత్వానికి స్థలం వదలకుండా, మరికొందరు చలాన్లు కూడా కట్టకుండా, అనుమతులు లేకుండా వెంచర్లు వేసేశారు. ఎవరైనా అడిగితే మా మంత్రి పెద్దిరెడ్డి చెప్పారనేవారు. అదే సమయంలో పుంగనూరు నుంచి రాయలపేట, నెక్కొంది, చౌడేపల్లె వేళ్లే మార్గంలో పట్టణానికి సమీపంలో బైపాస్‌రోడ్డు పక్కనే పుంగనూరు మాజీ ఎమ్మెల్యే ఎన్.శ్రీధర్‌రెడ్డి, ఆయన తల్లికి చెందిన పొలం ఉంది. అక్కడే జే న్యూటౌన్ పేరిట వెంచర్ వేశారు. ఈయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పేరుతో ఏతూరు గ్రామంలోని సర్వేనెంబరు100/3, 101/1, 83/2, 85/2, 85/3, 85/4ల్లో 4.45 ఎకరాలు.. ఆయన తల్లి ఎన్.ఎల్లమ్మరెడ్డి పేరుతో సర్వేనెంబర్లు 84/1, 86/2, 85/1, 88, 84/2, 86/1, 87/2, 84/3ల్లో 32.44 ఎకరాలు చొప్పున మొత్తం 36.89 ఎకరాలున్నాయి. అలాగే జేన్యూటౌన్‌లో తమ భూములున్నాయని పుంగనూరు కోర్టులో కొందరు రెండు కేసులు దాఖలు చేశారు. దాదాపు 60.71 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ వేశారు. దీని పక్కనే తీగలమ్మచెరువు నిండితే వరదనీరు ప్రవహించడానికి పూర్వం నుంచి మొరవ ఉండేది. ఈ వెంచర్ మధ్యలో మొరవ వెళుతుండటంతో తమ ప్లాట్లకు ఇబ్బందిగా ఉంటుందని నాటి ప్రభుత్వ పెద్దల సహకారంతో పెద్ద మొరవను మూడు సిమెంట్ పైపులుపెట్టి కాల్వగా మార్చి ఆక్రమించారు. వెంచర్‌లోపల కూడా పైపులు పెట్టి పైన మట్టితో పూడ్చారు. భారీ వర్షాలు వస్తే వరదనీరు ఉధృతంగా వెళ్లే అవకాశం లేకుండా కుదించేశారు. పుంగనూరుకు ఇప్పటికి రెండుమార్లు వరదలు వచ్చిన విషయం తెలిసిందే. మొరవ ఆక్రమించినా ఏ అధికారి అడ్డుకున్న దాఖలాలు లేవు.



తీగలమ్మ చెరువు మొరవను ఆక్రమించి ఏర్పాటు చేసిన పైపులు



కుంచించుకు పోయిన వరదనీరు వెళ్లే మొరవ

పంచాయతీ కరెంటూ వాడేశారు!

ఈ వెంచర్ కోసం ఏతూరు గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా ఈఏడాది ఫిబ్రవరిలో కరెంట్ సర్వీసు తీసుకొని వాడుకున్నారు. వీధిదీపాలు, వాటర్‌వర్క్స్ అవసరాలకు ఉపయోగించకుండా సర్వీసు నెంబరు 5811502003578లో గత నెల వరకు 976 యూనిట్ల కరెంటును వినియోగించారు. కరెంట్ బిల్లు రూ.41,077, ఎసీడీ చార్జి రూ.26,910 బకాయి ఉంది. కరెంట్ తీసుకున్నప్పటినుంచి పైసా కూడా చెల్లించలేదు. బైపాస్‌రోడ్డుకు మూడుమీటర్లలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పక్కనే ఉన్న కల్వర్టు కింద కేబుల్ తీసుకెళ్లి జేన్యూటౌన్‌కు కరెంట్ ఇవ్వడం వల్ల రోడ్డుప్రమాదాలు జరుగుతాయని గత నెలలో కొందరు స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో పంచాయతీ కరెంటు వాడుతున్న విషయం బయటపడుతుందని గ్రహించి ఆ విద్యుత్ కనెక్షన్‌ను సిబ్బంది తొలగించారు. ప్రస్తుతం మీటరు ఖాళీగా ఉంది. వెంచర్‌లో విద్యుత్ శాఖకు సంబంధించి అనేక ఉల్లంఘనలు, అక్రమాలు జరిగాయని ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదులు పంపినట్లు తెలిసింది.

బ్యూటిఫికేషన్ కోసం ఎన్‌హెచ్ ఆక్రమణ

జేన్యూటౌన్ వెంచర్ కోసం బైపాస్‌రోడ్డులోని జాతీయ రహదారిని ఆక్రమించి గ్రీనరీ, మొక్కలు, పూలమొక్కలు నాటి బ్యూటిఫికేషన్ పనులు చేశారు. ఎన్‌హెచ్ రోడ్డు రెండువైపులా విద్యుత్ స్తంభాలు హద్దులుగా ఉండగా వెంచర్ వరకు మాత్రం సగం స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించినా అధికారులు పట్టించుకోలేదు. బయట ప్రాంతాల నుంచి పదేళ్లకు పైబడిన చెట్లను వేర్లతో పాటు ప్రత్యేకంగా వాహనాల్లో తీసుకొచ్చి వెంచర్ ముందు, లోపల నాటారు. వైసీపీ అధికారంలో ఉండటంతో అడ్డుఅదుపులేకుండా నిబంధనలు తుంగలో తొక్కారన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడు ఇవన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వీటిపై సమగ్రంగా విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.



కొత్త చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి

గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి ● నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఆదేశం

చిత్తూరు, జూలై 2: కొత్త చట్టాలను ప్రతి పోలీసు స్టేషన్‌లో అమలు చేయడంతో పాటు ప్రజలందరికీ అవగాహన కల్పించేలా అవగాహన సదస్సులను నిర్వహించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో మంగళవారం ఆయన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులతో పాటు మర్డర్, డెకాయిట్, రాబరీ, ప్రాపర్టీ, వాహనాల దొంగతనాలు కేసులు, మిస్సింగ్ కేసులు, చీటింగ్, సైబర్ నేరాలు తదితర కేసులపై సమీక్షించారు. కేసుల ఛేధింపులు, పరిష్కారం, నేర నియంత్రణకు పలు సూచనలను చేశారు. కేసు నమోదైన తరువాత కోర్టులో నిందితులకు శిక్షణ పడేటట్లు చేస్తే బాధితులకు న్యాయం చేసిన వాళ్లమవుతామన్నారు. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు సాంకేతికతను వినియోగించి నిందితులను త్వరగా పట్టుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. ప్రాపర్టీ నేరస్తులు, పాత నేరస్థులపై గట్టి నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణా నిందితులపై ఉక్కుపాదం మోపాలన్నారు. డ్రగ్స్‌తో అనర్థాలపైనా అవగాహన కల్పించాలన్నారు. రాత్రి, పగలు బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. 2024 ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, సుబ్బారావు, మూడు డివిజన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ మణికంఠ

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

సత్యవేడు, జూలై 2: గంజాయి కేసులో సత్యవేడు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కిలో గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శ్రీకాళహస్తి మార్గంలో కాళమనాయుడుపేట వద్ద మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులను పోలీసు సిబ్బంది ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా బైక్‌ట్యాంక్ కవరులో గంజాయి బయటపడింది. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు యువకులను అదుపులో తీసుకుని విచారించగా సత్యవేడు గంగమిట్ట వీధికి చెందిన కుమార్(25), దళితవాడకు చెందిన కాశీయప్ప(22)గా తెలిసింది. వారు వారు గంజాయి అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.ఐదువేలు, ద్విచక్ర వాహనం విలువ రూ. 50 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నిందితులు సూళ్లూరుపేటలో గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులు ఉదయమే పట్టుబడ్డా పొద్దుపోయే వరకు సంబంధిత వివరాలను మీడియాకు వెల్లడించకుండా పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు దారితీసింది. ఈ విషయమై సీఐ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా నిందితుల విచారణ, కేసు నమోదు తదితర ప్రొసీజర్ ఆలస్యం కావడంతో ప్రెస్‌మీట్ పెట్టలేకపోయామని ఆయన చెప్పడం కొసమెరుపు.

సౌత్‌జోన్ రెజ్లింగ్ టోర్నీలో హర్షిత ప్రతిభ



తిరుపతి (క్రీడలు), జూలై 2: తమిళనాడు మిట్టూరుద్యాం జిల్లాలో జరిగిన సౌత్‌జోన్ అండర్ 23 రెజ్లింగ్ టోర్నీలో వెదురుకుప్పం మాంబేడు గ్రామానికి చెందిన కొణిదల హర్షిత ప్రతిభ కనబరిచింది. 57కిలోల విభాగంలో కాంస్యం, మట్టికుస్తీ విభాగంలో రజత పతకాలు సాధించింది. ఈమె శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆరు నెలలుగా శాప్ రెజ్లింగ్ శిక్షకురాలు హిందూజ వద్ద శిక్షణ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీనివాస క్రీడాసముదాయంలో క్రీడాకాధికారి సయ్యద్‌సాహేబ్ ఆధ్వర్యంలో హర్షితను సత్కరించారు. ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోచ్ ప్రేమనాథ్, రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

రేణిగుంట, జూలై 2: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక బంగారు చైను స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట సీఐ మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామా నగర్‌లో పోలీసులు గాలింపు చేపట్టారు. పోలీసులను గమనించిన కొంతమంది పారిపోయేందుకు యత్నించగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా తిరుపతి మారుతీ నగర్‌కు చెందిన జశ్వంత్, సంజీవనగర్‌కు చెందిన సతీష్, కోలా వీధికి చెందిన జశ్వంత్, ప్రసన్నకుమార్, భవానీనగర్‌కు చెందిన వేముల చరణ్, రఘునాథ్‌రెడ్డి కాలనీకి చెందిన రియాజ్, పాకాలకు చెందిన దిలీప్‌గా తెలిసింది. ఇది వరకే వీరిపై తమిళనాడు తిరువల్లూరు, తిరుచానూరు, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి దోపిడీ, చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ల చోరీ కేసులు కేసు నమోదైనట్లు తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, రైటర్ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



దొంగల ముఠాను అరెస్టు చూపుతున్న సీఐ మల్లికార్జున్

వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న వీరభద్రస్వామి



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న వీరభద్రస్వామి

మదనపల్లె అర్బన్, జూలై 2: స్థానిక కదిరిరోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని మంగళవారం స్వామివారి 8వ తరం వంశీయులు వీరభద్రస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, కన్నడ దేశపర్యటన చేస్తూ మార్గమధ్యలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి అందులో జరిగే నిత్యపూజ కైంకర్యములను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువు వీరభద్రస్వామిని ఆలయ ట్రస్టు సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం, నవయుగ స్వర్ణకారుల సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఉత్తరాధి నారాయనాచారి, పెడబల్లి లక్ష్మీనారాయనాచారి, పచ్చిపాల రామకృష్ణాచారి, సుమంత్ కల్యాణ్,విశ్వేశ్వరాచారి, చంద్రాచారి, నాగభూషణాచారి, సుబ్రహ్మణం ఆచారి,ఆలయ అర్చకులు వడ్లపూడి వీరబ్రహ్మాచారి, కరమల చెంగాచారి. తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

● మంత్రిని కలిసిన టీడీపీ బీసీ విభాగం నాయకులు



రాష్ట్ర చేనేత,జౌళిశాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసిన మదనపల్లె టీడీపీ బీసీ విభాగం నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 2: మదనపల్లె పట్టణంలో పదివేల మందికిపైగా చేనేత కార్మికులు ఉన్నారని ఈ రంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర చేనేత ,జౌళిశాఖ మంత్రి సవితను టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు కోరారు. మంగళవారం పెనుగొండలో మంత్రి సవితను మర్యాద పూర్వకంగా కలసిన త్యాగరాజు మాట్లాడుతూ పట్టణంలో చేనేత కార్మికులు ముడిసరుకు ధరలు పెరిగిపోయి, నేసిన చీరలకు ధరలే లేక అప్పులపాలయ్యారన్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చేనేత కార్మికుల ఏదేని సంక్షేమ పథకం ప్రవేశపెట్టి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, సోమశేఖర్, చేనేత సంఘం నాయకులు నాగరాజు, వెంకటేశ్, వెంకటరమణ, సూరి పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన రామ్‌దాస్‌చౌదరి



మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, జూలై 2: జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. మంగళవారం కలికిరికి వెళ్లి రామ్‌దాస్‌చౌదరి, మాజీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మాజీ సీఎం మాట్లాడుతూ కూటమి నేతలు, కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాజంపేట పరిధిలోని మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా..తాను అందుబాటులో ఉంటానని, అవసరమైతే, మీ సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు రామ్‌దాస్‌చౌదరి పేర్కొన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివ రామ్ ఉన్నారు.

నేడు రుషివాటిక క్యాంపస్‌కు శృంగేరి పీఠాధిపతి

బి.కొత్తకోట, జూలై2: బి.కొత్తకోట మండల పరిధిలోని గుట్టకిందపల్లి వద్ద వెలసిన రుషివాటిక క్యాంపస్ కు బుధవారం కర్ణాటకలోని శృంగేరి పీఠాధిపతి అభినవ శంకర భారతి మహాస్వామి వారు విచ్చేస్తున్నట్టు రుషవాటిక ప్రతినిధులు తెలిపారు. లోక కళ్యాణం కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరికీ ఆహ్వానం పలుకుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతున్నట్టు సమాచారం.

రేపు విద్యాసంస్థల బంద్

మదనపల్లె టౌన్, జూలై 2: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించడంలో విఫలమయ్యారని, దీనికి నిరసనగా ఈనెల 4న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ నీట్ పరీక్షను 12గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్షను రద్దు తో దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనకు గురయ్యారన్నారు.

డయేరియా నివారణకు చర్యలు

● స్టాప్ డయేరియాను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి : డీఐవో ● సర్వజన బోధనాస్పత్రిలో స్టాప్ డయేరియా ఏర్పాట్లు



పీలేరురేగళ్లలోని పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షిస్తున్న డీఐవో డాక్టర్ ఉషశ్రీ



కలికిరిలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ చిన్నరెడ్డెప్ప

పీలేరు, జూలై 2: డయేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి(డీఐవో) డాక్టర్ ఉషశ్రీ పీలేరు మండలం రేగళ్ల పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు. రేగళ్లలో మంగళ వారం ఆమె పీహెచ్‌సీ సిబ్బందితో 'స్టాప్ డయేరియా'పై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీళ్ల వీరేచనాలు(డయేరియా) కారణంగా మన దేశంలో ప్రతి ఏటా సంభవిస్తున్న లక్షలాది శిశు మరణాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను ఈ నెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా తమ పరిధిలోని ప్రాంతాల్లో 0-5 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి వారి తల్లులకు ఓఆర్ఎస్ ద్రావణం తయారీ, వినియోగం గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానం నేర్పించాలన్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సతీశ్ కుమార్, శైలజ, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్స్ రమాదేవి, చిన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో స్టాప్ డయేరియా ఏర్పాట్లు

మదనపల్లె టౌన్, జూలై 2: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పలు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం స్టాప్ డయేరియాలో భాగంగా ఆస్పత్రిలోని అతిసారా విభాగం, అత్యవసర విభాగంతో పాటు పలు వార్డుల్లో ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన మినరల్ వాటర్ క్యాన్లను ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ ప్రస్తుతానికి పెద్దగా డయేరియా రోగులు ఆస్పత్రికి చేరడం లేదని, ఒక వేళ పెద్దసం ఖ్యలో వచ్చినా వారికి చికిత్స అందించేందుకు పరికరాలు, ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసులు, ప్రసాదరాజు, విష్ణువర్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరిలో: డయేరియా వ్యాధి ప్రబలకుండా నివారించడానికి ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటుతో చర్యలు తీసుకోవాలని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప సూచించారు. మంగళవారం మండలంలోని అద్దవారిపల్లె పంచాయతీలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మురుగు నీరు తాగునీటితో కలుషితం కావడంతోనే ప్రధానంగా డయేరియా ప్రబలుతుందన్నారు. దీంతో కామెర్లు కూడా వచ్చే అవకాశముందని హెచ్చరించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని కోరారు. వాంతులు, విరేచనాల లక్షణాలుంటే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పూజిత, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కలకడలో:గ్రామాల్లోని ప్రజలకు డయేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యాధికారులు డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబులు సూచించారు. మంగళవారం ఆశా డే సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడుతూ 0-5 వయస్సున పిల్లల ఉన్న ఇళ్లలో సర్వే నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలను తెలపాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రమలను అందుబాటులో ఉంచి పంపిణీ చేయాలన్నారు. అలాగే దోమల నివారణకు పరిసరాల శుభ్రత గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.





కలకడలో మాట్లాడుతున్న డాక్టర్ జవహర్‌బాబు

మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో రోగుల కోసం ఓఆర్ఎస్ వాటర్ క్యాన్లు ఏర్పాటు చేయిస్తున్న వైద్యులు

విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలి

కురబలకోట, జులై 2: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలో కురబలకోట జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేసిన కిట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన కిట్‌లను విద్యార్థులకు త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠ్యాంశాలను పూర్తి చేసి, నాణ్యమైన విద్యనందించాలని కోరారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాలు అత్యధికంగా సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. మండల విద్యాకేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదును అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యాశాఖాధికారుల పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కురబలకోట జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాష్‌రెడ్డి, ఎంఈవో ద్వారకనాథ్ తదితరులు

టీచ్ టూల్‌తో మెరుగైన బోధన : డీఈవో

మదనపల్లె అర్బన్, జూలై 2: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు టీచ్ టూల్ ద్వారా మెరుగైన బోధన చేయవచ్చని డీఈవో శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, సమగ్ర శిక్ష ఏపీ సంయుక్తంగా టీచ్ టూల్ పేరుతో మదనపల్లె డివిజన్‌లోని సీఆర్‌పీలు, ప్రైవేట్ హైస్కూల్ హెచ్ఎంలు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృతి నైపుణ్యాలను అభివృద్ధి పరచడానికి, అదే విధంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎన్‌సీఈఆర్‌టీ పలు రకాల పద్ధతులను అధ్యయనం చేస్తోందన్నారు. టీచర్‌కు విద్యార్థులకు మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ ఉపయోగపడతాయన్నారు. మదనపల్లె డివిజన్‌లోఏ 7,667 మంది పిల్లలకు బుధవారం లోపు యూనిఫాం పంపిణీ చేయడానికి సిద్ధం చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పాఠపుస్తకాలను రెండు రోజుల్లో విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు రాలేదని డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష సీఎంవో కరుణాకర్, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పద్మావతి, నారాయణ, హేమలత, ఆంజనేయులు, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఆర్‌వి రమణ, పఠాన్ మహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



వాల్మీకిపురం, జూలై 2: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహాలయంలో కృత్తికా నక్షత్రం సందర్భంగా మంగళవారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణమండపంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వేద పండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వసంతమ్మ, కోమల, శశికళ, రాధమ్మ, అరుణ, వెంకటేష్, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

బీఎస్పీ అధ్యక్షుడిగా సోమశేఖర్

ములకలచెరువు, జూలై 2: బహుజన్ సమాజ్ పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా సోమశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మద్దినాయనిపల్లెకు చెందిన సోమశేఖర్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు యుగంధర్, తంబళ్లపల్లె ఇన్‌చార్జి సిద్ధగాళ్ల ప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యానవన పరికరాలకు ప్రతిపాదనలు

నిమ్మనపల్లి, జూలై 2: మండలంలోని ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన స్పింక్లర్లు, డ్రిప్‌లకు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలో 1300వందల ఎకరాలలో మామిడి సాగులో ఉందన్నారు. ఇవే కాకుండా టమాటా, నిమ్మ, బొప్పాయి, పూలసాగు జామ, డ్రాగన్‌ఫ్రూట్ తదితర ఉద్యాన రైతులకు ఎలాంటి సలహాలు కావాలన్నా సంప్రదించవచ్చన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి..కేసు నమోదు

బి.కొత్తకోట, జూలై2: టీడీపీ కార్యకర్తపై దాడి చేసిన ముగ్గురు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదైంది. మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీ సుంకరవారిపల్లె కు చెందిన పి.రామదాసు(45) పింఛను తీసుకోవడానికి తమ సమీప గ్రామమైన బండమీదపల్లెకు వెళ్లాడు. అక్కడే వున్న వైసీపీ కార్యకర్తలు రామలింగారెడ్డి, సురేంద్రరెడ్డి, మధుకర్‌రెడ్డి లుదాడి చేశారు. ఈ విషయమై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తంబళ్లపల్లెలో పింఛన్లు పూర్తి

తంబళ్లపల్లె, జూలై 2: తంబళ్లపల్లె మండలంలో 6284 పింఛను లబ్ధిదారులు ఉండగా..సోమ, మంగళవారాల్లో 6240 మందికి 99.30 శాతం ఫించన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం సచివాలయ ఉద్యోగులు మదనపల్లె, బెంగళూరు వంటి పట్టణాలలో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పింఛను లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛను అందచేసినట్లు తెలిపారు.

గర్భిణుల నమోదును తప్పనిసరిగా చేపట్టాలి



కురబలకోటలో సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న డీపీవో

కురబలకోట, జులై 2: గర్భిణుల నమోదును తప్పనిసరిగా చేపట్టాలని డీపీవో ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కురబలకోట ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాగా ప్రభుత్వం 40అంశాలను ఎంపిక చేసి 6అంశాలను జూలై నుంచి సెప్టెంబరు ఆఖరులోగా వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ నెల 4న మండలస్థాయిలో ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయాలలో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, ఈవోపీఆర్‌డీ అబ్దుల్ సుకుర్, పంచాయతీ కార్యదర్శులు శేషగిరి, నవాజ్, రామప్ప, ప్రవీణ్, రిహాన్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫామ్ పంపిణీ



పెద్దతిప్పసముద్రం, జూలై 2: పీటీయం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. మంగళవారం ఎంఈవోలు నారాయణ, గౌస్ పీర్ స్థానిక విద్యాశాఖ కార్యాలయ స్టాక్ పాయింట్‌లో ఉన్న యూనిఫామ్‌లను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3240 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ 3 జతల చొప్పున ప్రభుత్వం యూనిఫామ్ అందించనున్నట్లు వారు తెలిపారు. వీటిని ఆయా హెచ్ఎంలు విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత జన్మదిన వేడుకలు



కేట్ కట్ చేస్తున్న టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి, తదితరులు

మదనపల్లె, జూలై 2: మదనపల్లె మండలం బసినికొండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పులగంటి పెద్దరెడ్డెప్ప జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బసినికొండలో మంగళవారం ఆపార్టీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వి.నటశేఖర్, నరేంద్ర, గోపాలకృష్ణ, యశ్వంత్, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● అండగా ఉండి సొంత నిధులతో ఉమ్మడి ప్రమాద బీమా చేయిస్తా

● తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి



ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 2: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్ని నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని కదిరి రోడ్డులో ఉన్న భగత్‌సింగ్ ఆటో యూనియన్ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆటో డ్రైవర్లకు అన్ని విధాల అండగా ఉండి ఏ కష్టం వచ్చినా ముందుంటాయన్నారు. ఆటో డ్రైవర్లకు సొంత నిధులతో ఉమ్మడి ప్రమాద బీమా చేయిస్తానని ఇందుకు ఎంత ఖర్చు వచ్చినా తానే భరిస్తానన్నా రు. ఉమ్మడి ప్రమాద బీమాతో ఆటో డ్రైవర్లకు ప్రమాదాలు జరిగితే రూ.5లక్షల వరకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. కాగా టీడీపీ నేత జయచంద్రారెడ్డికి ఆటో డ్రైవర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ఆటో డ్రైవర్లకు తినిపించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నేతలు మంత్రి గిరిధర్‌రెడ్డి, మయాన్ బాషా, తోట గిరిధర్, చెన్నకిష్టా, కేశవులు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌నాయుడు, శ్రీనివాసులు, గొడ్డుమూరు రవి, ఆటో యూనియన్ నాయకులు కట్టుబడి ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, మహమ్మద్ రఫీ, మస్తాన్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో నడిపిన జయచంద్రారెడ్డి

ములకలచెరువులోని ఆటోయూనియన్ వార్షికోత్సవ కార్యక్రమలో పాల్గొన్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆటో నడిపారు. డ్రైవర్ల కోరిక మేరకు కొంత దూరం ఆటో నడపి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సమస్యలను ఆటో డ్రైవర్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

వలంటీర్లు లేకున్నా మెరుగ్గా పింఛన్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జూలై 2: వలంటీర్లు లేకుండానే వైసీపీ నాయకులకు చెంపపెట్టులా చంద్రబాబు ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో ఒక్కరోజులోనే 95శాతం పింఛన్లను పంపిణీ చేయించిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు అపార అనుభవంతో ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతమైందన్నారు. సంక్షేమ పథకాలు అంటేనే టీడీపీ అని, ఆనాడు ఎన్టీఆర్ నుంచి నేడు చంద్రబాబు వరకు పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారన్నారు. నేడు లబ్ధిదారులకు రూ.4వేలకు పింఛన్ పెంచడంతో పాటు పెంచిన రూ.వెయ్యి మూడు నెలలకు కలిపి మొత్తం రూ.7వేలు అందించి లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూశారన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఒక్కరోజే 120 ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అన్వర్‌బాషా, ప్రభాకర్, నరసింహులు, నాగరాజు, బద్రీనాథ్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల హామీని విజయవంతం చేసిన చంద్రబాబు



గ్రామస్థులు, కూటమినేతల మధ్య కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకురాలు పర్వీన్‌తాజ్

పెద్దమండ్యం, జూలై 2: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పింఛన్ల మొదటి హామీ నిలపెట్టుకొని విజయవంతం చేశారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పెద్దమండ్యం మండలం సిద్దవరం గ్రామ పంచాయతీ గాజులపల్లి గ్రామంలో ప్రజలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్, కూటమి నేతలు గంగమ్మ గుడి వద్ద మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 20 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ ముఖ్యమంత్రి హయాంలో మంత్రి పదవి హోదాలో చంద్రబాబు నాయుడు ఈ గ్రామానికి విచ్చేసిన అనుబంధం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు సీఎంగా చంద్రబాబునాయుడుతో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందంటూ కేక్‌కట్‌చేసి పంచి ఆ గ్రామంలో పిల్లలు, వృద్ధులు, మహిళలకు కూటమి నేతలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. కూటమి నేతలు ఎంపీటీసీ రుక్మాంగధరెడ్డి, సిద్దవరం ప్రసాద్, చిన్నరాం, లక్ష్మీనారాయణ, శంకర, రామాంజులునాయుడు, వెంకటమ్మ, జయచంద్రనాథ, రాఘవ, సాంబశివ, బావజాన్, రామాంజునేయులు, విశ్వనాథ, సయ్యద్‌షావలి, గరిబున్నీషా, మేకల చలపతి, ప్రభాకరరెడ్డి, సుబ్బరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వాల్మీకిపురం, జూలై 2: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ యూనియన్ నేతలు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. మంగళవారం నగిరిపల్లెలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆమేరకు వారొక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాల పెంపు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. వాల్మీకిపురంలో ప్రాజెక్టు కార్యాలయానికి పక్కా భవనాల పూర్తి చేయాలని, 2022 నుంచి ఈవెంట్స్ బిల్లులు మంజూరు చేయాలని, అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు అర్హులైన వారికి పెన్షన్ ఇవ్వాలని తదితర సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తప్పక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు శారద, అమ్మాజీ, భూకైలేశ్వరి, ఉమాదేవి, సునీత, శ్రీలేఖ, లక్ష్మీప్రసన్న, జయప్రద, ప్రభావతి, దేవసేన, ఉషారాణి, పార్వతి, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కృషి

● మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



వాల్మీకిపురంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 2: వాల్మీకిపురం మండల అభివృద్ధే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్యేయంగా కృషి చేస్తున్నారని మాజీ మా ర్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో కూటమి పార్టీల నాయ కులు, కార్యకర్తలతో సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కిశోర్‌కు మార్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈనెల 5న (శుక్రవారం) వాల్మీకిపురం మండలంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పర్యట నకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈసమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, పులి సత్యారెడ్డి,పీవీ నారాయణ, చంద్ర మౌళి, గాంధీపేట రమణ, రమేష్, రాజేంద్రాచారి, జనసేన దేపాని ప్రభాకర్, బొక్కసం బ్రదర్స్, స్వర్ణలత, అడ్వకేట్ రమణ, సురేంద్రవర్మ, వల్లిగట్ల వెంకటరమణ, శేషాద్రిరెడ్డి, మురళి, తోటవీధి ఫణి, సైదు, బొక్క సం బ్రదర్స్ జంషీద్, తరుణ్, జగ్గు, హుస్సేన్, జావీద్, మస్కట్ మస్తాన్, కువైట్ సయ్య ద్‌బాషా, డిష్ బ్రదర్స్, రామాంజులురెడ్డి, స్వర్ణలత, చింతల దామోదర్‌రెడ్డి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియా నియంత్రణ



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్

గుర్రంకొండ, జూలై 2:దోమల నివారణతోనే మలేరియా వ్యాధిని నివారించవచ్చని జిల్లా మలేరియాధికారి వేణుగోపాల్ సిబ్బందికి సూచించారు. మండలంలోని గుర్రంకొండ, ఖండ్రిగ గ్రామాల్లో మలేరియాపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు రోగాలు ప్రబలకుండా ఉండాలంటే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టడంతో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా జ్వరాలు వస్తాయన్నారు. ప్రజలు వైద్య సిబ్బంది ఇచ్చే సూచనలను పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు.